దేశానికే ఆదర్శంగా జగనన్న పాలన

- మాజీ మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్
- మిన్నంటిన జయహో జగనన్న నినాదం


సర్వమత ప్రార్థనల్లో పాల్గొన్న అనిల్‌కుమార్ యాదవ్, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు) : దేశానికే ఆదర్శంగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించారని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు డాక్టర్ పోలుబోయిన అనిల్‌కుమార్‌యాదవ్ తెలిపారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను నగరంలోని రాంజీనగర్‌లో ఉన్న పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ, సిటీ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత భారీ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. జై జగన్, జయహో జగన్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వైఎస్ జగన్ పాలన సాగిందన్నారు. పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న ఐదేళ్ల పాలనలో విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చి ఏపీని దేశానికే ఆదర్శంగా నిలిపారన్నారు. అనంతరం నిర్వహించిన రక్తదాన శిబిరంలో వందలాది మంది స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో పార్టీ నగరాధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, పార్టీ నేతలు ఖలీల్‌అహ్మద్, హంజాహుస్సేని, ఊటుకూరు నాగార్జున, ఆశ్రిత్‌రెడ్డి, మంచికంటి శ్రీనివాసులు, పేర్నేటి కోటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

➡ నెల్లూరు (లీగల్) : వైఎస్సార్‌సీపీ లీగల్ జోనల్ ఇన్‌చార్జి రామిరెడ్డి రోజారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక రెడ్‌క్రాస్ ఆవరణలో వైఎస్ జగన్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులు, మానసిక వికలాంగుల విద్యార్థులకు దుప్పట్లు, పండ్లు, అల్పాహారం అందజేశారు. నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్‌రెడ్డి, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, ప్రధాన కార్యదర్శి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

కాకాణి పూజిత ఆధ్వర్యంలో..

నెల్లూరు(బారకాసు) : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా అయ్యప్పగుడి సమీపంలో ఉన్న ప్రగతి చారిటబుల్ ట్రస్ట్, మానసిక వికలాంగుల కేంద్రంలో కాకాణి పూజిత ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆమె పిల్లల సమక్షంలో భారీ కేక్‌ను కట్ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కాకుటూరు లక్ష్మిసునంద, నాయకులు కోదండరామిరెడ్డి, బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, కొణిదల మోహన్‌నాయుడు, మందల వెంకటశేషయ్య, ఇంద్రసేనగౌడ్, రాము, వెంకటజ్యోతి, లావణ్య, శారద, బషీరా, భారతి, ఫరీదా, రిజ్వానా, పర్వీన్, మస్తాన్‌బీ పాల్గొన్నారు.

➡ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ నేత ఈదల ధనుజ ఆధ్వర్యంలో నజీర్‌తోటలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. నాయకులు వెంకటేష్, భాస్కర్‌రెడ్డి, ప్రభాకర్, శ్రీలక్ష్మి, వెంకటరమణమ్మ, మాధవి పాల్గొన్నారు.

➡ ఫత్తేఖాన్‌పేట ప్రాంతంలో డివిజన్ ఇన్‌చార్జి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. సుభాన్, సాయి, కార్తీక్, తేజోకిరణ్, రవీంద్రరెడ్డి, అభిషేక్, అనితరెడ్డి, జైలుమా, సల్మా పాల్గొన్నారు.

➡ స్థానిక చింతారెడ్డిపాళెంలో యూత్ ఆధ్వర్యంలో భారీ కేక్‌ను కట్ చేశారు. ఆనంద్, లోకేష్, బన్నిపాల్ పాల్గొన్నారు.


రెడ్‌క్రాస్ ఆవరణలో దుప్పట్లు, అల్పాహారం పంపిణీ


మానసిక వికలాంగుల కేంద్రంలో అన్నదానం

➡ తమిళనాడులోని విరుదునగర్ జిల్లా, కృష్ణంకోయిల్ ప్రాంతంలో జగనన్న జన్మదిన వేడుకలను అభిమానుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భారీ కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు.

జగనన్న.. నువ్వే కావాలి

నెల్లూరురూరల్ : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని ఆయన ఫ్లెక్సీని దేవిరెడ్డి శ్రీరామ్‌కుమార్‌రెడ్డి అనే విద్యార్థి ఏర్పాటు చేశారు. అమ్మఒడి వల్ల చదువుకున్నానని, ఇప్పుడు రాకపోవడం వల్ల నాలాంటి పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు.



వైఎస్ జగన్ ఫ్లెక్సీని ఏర్పాటు చేసిన విద్యార్థి


ఫత్తేఖాన్‌పేటలో..


తమిళనాడులోని కృష్ణంకోయిల్ ప్రాంతంలో..


చింతారెడ్డిపాళెంలో..


నజీర్‌తోటలో..

క్లుప్తంగా

25న బీసీ సమన్వయ కమిటీ సమావేశం

నెల్లూరురూరల్ : ఈనెల 25న ఉదయం 10 గంటలకు జిల్లా బీసీ సమన్వయ కమిటీ సమావేశం ముత్తుకూరు రోడ్డులోని హోటల్ రాధే గెస్ట్ ఇన్‌లో జరుగుతుందని మాజీ ఎమ్మెల్సీ బుధాటి రాధయ్య శనివారం తెలిపారు. అన్ని కుల సంఘాల కో–కన్వీనర్లు, బీసీ సంఘాల ప్రముఖులు తరలిరావాలని కోరారు. బీసీ సమన్వయ కమిటీ జిల్లా చైర్మన్ బొమ్మి నాగకిశోర్ యాదవ్, జిల్లా కన్వీనర్ బాలాజీ, భాస్కర్‌గౌడ్, సోమగోపాల్ నేత పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

నెల్లూరు(క్రైమ్) : చెముదుగుంటలోని డీటీసీలో యాక్టివ్ రౌడీషీటర్లకు ఏఎస్పీ సౌజన్య ఆధ్వర్యంలో స్పెషల్ కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీట్ ఎప్పుడు ఏ కేసులో తెరిచారు? ప్రస్తుతం ఏమి చేస్తున్నారు? ఎక్కడ ఉంటున్నారు.. తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్రమం తప్పకుండా కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు. సత్ప్రవర్తనతో జీవిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రౌడీషీట్లు తొలగిస్తామన్నారు. నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి, ఇన్‌స్పెక్టర్లు చిట్టెం కోటేశ్వరరావు, అన్వర్‌బాషా, మద్ది శ్రీనివాసరావు, రోశయ్య, కిశోర్‌కుమార్, సాంబశివరావు, ఎస్సైలు పాల్గొన్నారు.

నలందలో సైన్స్ ఎక్స్‌పో



నెల్లూరు (టౌన్) : స్థానిక బాలాజీ నగర్‌లోని నలంద స్కూల్‌లో సైన్స్ ఎక్స్‌పోను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టు నమూనాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి హాజరై, మాట్లాడారు. చిన్నతనం నుంచే సైన్స్ పట్ల అభిరుచి పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో నెహ్రూయువ కేంద్రం కో–ఆర్డినేటర్ మహేంద్రరెడ్డి, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు, ప్రిన్సిపల్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

నెల్లూరు(సెంట్రల్) : ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి శనివారం పలువురు బాధితులకు వారి క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. కోవూరు నియోజకవర్గంలో ఐదు విడతలుగా చెక్కులను అందజేశామని వారు తెలిపారు.

ఆయుష్మాన్ భారత్‌కు నమోదు

నెల్లూరురూరల్ : 24వ డివిజన్ ఇందిరమ్మ కాలనీలో 70 ఏళ్లు దాటిన వృద్ధులకు ఆయుష్మాన్ భారత్ పథకానికి శనివారం నమోదు చేయించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్‌కుమార్, మునునూరు సుబ్బారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు


నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని శెట్టిగుంటరోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని ఆ శాఖ టౌన్ ఈఈ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీవ్‌గాంధీ కాలనీ, మధురానగర్, ప్రశాంతి నగర్, పల్లిపాడు రోడ్డు, కిసాన్‌నగర్, జాకీర్‌హుస్సేన్ నగర్, మైపాడు రోడ్డు, వేణుగోపాల్ నగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు అంతరాయం ఉంటుందన్నారు.

ఘనంగా ప్రీ క్రిస్మస్


వీఆర్సీ క్రీడా మైదానంలో..

నెల్లూరు(బృందావనం) : వీఆర్సీ క్రీడా మైదానంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఏసుక్రీస్తును స్మరిస్తూ 'క్రిస్మస్ క్వైర్'తో గీతాలను ఆలపించారు. రెవరెండ్ పాస్టర్ డి.వినోద్‌ప్రకాష్, కన్వీనర్ డి.నవీన్ ప్రకాష్ పర్యవేక్షించారు.

➡ నెల్లూరు(బారకాసు) : నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను మేయర్ స్రవంతి, కమిషనర్ సూర్యతేజ సహకారంతో శనివారం రాత్రి అత్యంత వేడుకగా నిర్వహించారు. అదనపు కమిషనర్ నందన్, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు హాజరై ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఉద్యానాధికారి ప్రదీప్‌కుమార్, జిల్లా రిజిస్ట్రార్ హరివర్మ, సబ్ రిజిస్ట్రార్ విజయరాణి, పాస్టర్లు నోవాహు, ఎజ్రా పాల్గొన్నారు.


కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో..

నామినేటెడ్ సభ్యుల్లో నారాయణ సిబ్బంది

- వెనక్కు తీసుకోవాలని డిమాండ్

నెల్లూరు (టౌన్) : ఇంటర్మీడియట్ విద్యామండలి నామినేటెడ్ సభ్యులుగా నారాయణ విద్యాసంస్థల సిబ్బందిని నియమిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను వెనక్కు తీసుకోవాలని ఏఐడీఎస్‌ఓ రాష్ట్ర కార్యదర్శి మహేష్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యా మండలి నామినేటెడ్ సభ్యులుగా విద్యావేత్తలు, మేధావులు, అధ్యాపక వర్గ ప్రతినిధులను నియమించాలన్నారు. నారాయణ, శ్రీచైతన్య వంటి కార్పొరేట్ విద్యాసంస్థలు రూ.కోట్లలో ఫీజులు వసూలు చేస్తున్నాయని, దీనిని నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి విద్యాసంస్థలతో సలహాలు తీసుకుని ప్రభుత్వ ఇంటర్ కళాశాలల్లో బోధన మెరుగుపరుస్తామని, ఉత్తీర్ణత శాతాన్ని పెంచుతామని ప్రభుత్వం ప్రకటించడం అసంబద్ధమన్నారు.

గొలుసు దోపిడీ

నెల్లూరు(క్రైమ్) : నడిచి వెళ్తున్న మహిళ మెడలోని గొలుసులను ఓ దుండగుడు తెంపుకెళ్లిన ఘటన వేపదొరువులో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. వేపదొరువులో పద్మజ కుటుంబం నివాసం ఉంటోంది. ఆమె ఈనెల 20వ తేదీ రాత్రి తన అక్కతో కలిసి పూజా సామగ్రిని కొనుగోలు చేసి నడుచుకుంటూ ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగుడు బైక్‌పై ఎదురుగా వచ్చి పద్మజ మెడలోని ఆరు సవర్ల బంగారు సరుడు, నల్లపూసల దండను తెంపుకెళ్లారు. ఈ విషయాన్ని బాధితులు తమ కుటుంబ సభ్యులకు తెలియజేసి అర్ధరాత్రి బాలాజీనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సాంకేతికత ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మూగజీవాలకు టీకాలు వేయించాలి

నెల్లూరు(సెంట్రల్) : జిల్లాలోని మూగజీవాలకు పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచితంగా టీకాలు వేయిస్తున్నట్లు పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పీఎంపీ డే బ్రోచర్ల ఆవిష్కరణ



నెల్లూరు(అర్బన్) : ఈనెల 27న నిర్వహించనున్న 62వ పీఎంపీ వ్యవస్థాపక దినోత్సవ సభలకు బ్రోచర్లను నగరంలోని నారాయణ డెంటల్ కళాశాలలో ఏజీఎం చౌకచర్ల భాస్కర్‌రెడ్డి చేతుల మీదుగా శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో వైద్యసేవలు అందని చోట పీఎంపీలు తక్కువ ఖర్చుతో వైద్యం చేస్తూ ప్రజల అభిమానాన్ని సంపాదించారన్నారు. పీఎంపీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్ మాట్లాడుతూ తమ వ్యవస్థాపక దినోత్సవాన్ని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ పక్కనే ఉన్న కల్యాణ మండపంలో వచ్చే శుక్రవారం నిర్వహించనున్నామన్నారు. నూతన వైద్య విధానాలపై డాక్టర్లు ప్రసంగిస్తారన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి గోరంట్ల శేషయ్య, నాయకులు దేవరకొండ శ్రీనివాసులు, ప్రసాద్, వీరయ్య పాల్గొన్నారు.

మాజీ మంత్రి అనిల్ పరామర్శ



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని 53వ డివిజన్ ఇన్‌చార్జి మందేటి వెంగళరెడ్డి కుటుంబాన్ని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు పోలుబోయిన అనిల్‌కుమార్‌యాదవ్ శనివారం పరామర్శించారు. వెంకటేశ్వరపురం పునరావాస కాలనీలో వెంగళరెడ్డి తల్లి సుబ్బమ్మ కొన్ని రోజుల క్రితం మరణించారు. ఈ నేపథ్యంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖలీల్‌అహ్మద్, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలి

నెల్లూరురూరల్ : పార్లమెంట్ ఆవరణలో జరిగిన ఘర్షణలో బీజేపీ ఎంపీలు గాయపడ్డారని, అందుకు రాహుల్ గాంధీ బాధ్యత వహించి క్షమాపణ చెప్పాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్ డిమాండ్ చేశారు. స్థానిక చిన్నబజార్‌లోని బీజేపీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. రాహుల్ గాంధీ విచక్షణ కోల్పోయి మాట్లాడుతున్నారని, బీజేపీనే అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తుందన్నారు. పార్టీ నేతలు పెంచలయ్య, సాయి, హేమంత్, శివరామయ్య, శ్రీనివాస్ ఉన్నారు.


మాట్లాడుతున్న బీజేపీ నేత యశ్వంత్

రాష్ట్రస్థాయి పోటీలకు సౌత్‌మోపూరు విద్యార్థులు

నెల్లూరు సిటీ : రూరల్ మండలంలోని సౌత్‌మోపూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్యారమ్స్ పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం అన్వర్ హుస్సేన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో శనివారం మాట్లాడుతూ ఈనెల 22, 23వ తేదీల్లో ప్రకాశం జిల్లా పాకాలలో జరిగే పోటీలకు తమ పాఠశాల నుంచి ఏడుగురు బాలురు, ఆరుగురు బాలికలు పాల్గొననున్నారని వివరించారు. కార్యక్రమంలో పీఈటీ థామస్ పీటర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పోటీల్లో పాల్గొనే విద్యార్థులతో ఉపాధ్యాయులు

క్రికెట్ పోటీలు ప్రారంభం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : బుజబుజ నెల్లూరులోని సీఏఐ గ్రౌండ్స్‌లో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వీఎస్సార్ మెమోరియల్ టీ–20 క్రికెట్ లీగ్ పోటీలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధి బి.విజయ్‌కుమార్ మాట్లాడుతూ యువత అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అసోసియేషన్ అధ్యక్షుడు సీవీఎస్ఎస్ మూర్తి, కార్యదర్శి నిఖిలేశ్వర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి మునిగిరీష్, కోశాధికారి అబూబకర్, ఎన్‌డీసీఏ కేర్ టేకర్ డి.శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న క్రికెట్ అసోసియేషన్ నాయకులు

హాస్టల్స్‌కు సొంత భవనాలు నిర్మించాలి

నెల్లూరు (టౌన్) : జిల్లాలోని సాంఘిక సంక్షేమ హాస్టల్స్‌కు సొంత భవనాలు నిర్మించాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ రాహుల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అద్దె భవనాల్లో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, నాణ్యమైన భోజనం అందించడం లేదన్నారు. హాస్టల్స్ పరిస్థితిపై అధికారులు పట్టించుకోవడం లేదని చెప్పారు. కాస్మోటిక్ చార్జీలు పెంచి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు.

ఇంటర్ పరీక్షలకు సన్నద్ధం చేయాలి

నెల్లూరు (టౌన్) : ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని ఆర్‌ఐఓ శ్రీనివాసులు తెలిపారు. స్థానిక డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్‌తో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిబ్రవరి 1న జరిగే మానవీయ విలువలు, 3న జరిగే పర్యావరణ పరీక్షలకు విద్యార్థులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. 5వ తేదీ నుంచి ఒకేషనల్, 10 నుంచి ప్రాక్టికల్స్ పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్ష కేంద్రాల ప్రక్రియ త్వరలో పూర్తవుతుందని, పూర్తి వివరాలతో సిద్ధంగా ఉండాలని ప్రిన్సిపల్స్‌ను ఆదేశించారు. ఆపార్ కార్డుల జారీలో పురోగతి బాగా లేదని, ప్రిన్సిపల్స్ శ్రద్ధ తీసుకుని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. డీవీఈఓ మధుబాబు జూనియర్ కళాశాలల్లో ప్రవేశపెట్టిన సంకల్ప్, మధ్యాహ్న భోజన పథకంపై చర్చించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు.

డీకేడబ్ల్యూలో వినియోగదారుల సదస్సు

నెల్లూరు (టౌన్) : స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా సెట్నెల్ సీఈఓ శ్రీనివాసులు హాజరై వినియోగదారుల చట్టం తదితర వాటిపై అవగాహన కల్పించారు. దుకాణాల్లో జరుగుతున్న మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ గిరి, గయాజ్‌అహ్మద్, కన్జ్యూమర్ క్లబ్ కన్వీనర్ చెంచురామయ్య, వాణిజ్య విభాగాధిపతి విజయభాస్కర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



నెల్లూరు(సెంట్రల్) : రూరల్ పరిధిలోని 24వ డివిజన్‌లో రూ.5 కోట్లతో పలు అభివృద్ధి పనులకు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ తాను రూరల్ పరిధిలో జరిగే అభివృద్ధి పనులకు హాజరవుతానని తెలిపారు. గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

నెల్లూరు (టౌన్) : రాష్ట్రంలో నెలకొన్న విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్ తెలిపారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా మహాసభలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రూ.3,480 కోట్ల విద్యాదీవెన, వసతి దీవెన బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అనంతరం ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా నరేంద్ర, శ్రీహర్ష, సహాయ కార్యదర్శులుగా జీవన్, విష్ణు నియమితులయ్యారు. అభిలాష్, ప్రశాంత్, విక్రమ్, దేవేంద్ర, వేణు, లాజర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రసన్నకుమార్

నేటి నుంచి విశేష హోమాలు

నెల్లూరు(బృందావనం) : వేదాయపాళెంలోని అయ్యప్ప దేవస్థానంలో నేటి నుంచి 28వ తేదీ వరకు విశేష హోమాలు, నగరోత్సవం, వివిధ పూజలను నిర్వహిస్తున్నట్లు శ్రీస్వామిఅయ్యప్ప సేవా సమాజం అధ్యక్ష, కార్యదర్శులు గూడల శేషగిరిరావు, కత్తుల వెంకటరత్నం తెలిపారు. దేవస్థానంలో వారు శనివారం విలేకరులతో మాట్లాడారు. విశేష పూజల్లో భాగంగా నేడు మహా మృత్యుంజయ హోమం, సాయంత్రం సుదర్శన హోమం ఉంటుందన్నారు. పాలకమండలి సభ్యులు శంకరన్, పావళ్ల ప్రసాద్, గడ్డం విజయకుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శేషగిరిరావు, వెంకటరత్నం

ఎమ్మెల్యేకు వినతి

నెల్లూరు(బృందావనం) : మొబైల్‌ఫోన్ల వినియోగంపై విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలోనే అవగాహన కల్పించేలా పాఠ్యాంశాన్ని రూపొందించాలని 'ఏ ట్రస్ట్ ఫర్ ఆల్' అధ్యక్షుడు అళహరి వెంకటేష్ కోరారు. ఈ మేరకు కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి శనివారం ఆమె కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

వ్యవసాయ సిబ్బందికి డిప్యుటేషన్‌లు

నెల్లూరు(అర్బన్) : జిల్లాలోని సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న 48 మంది విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్(వీఏఏ), విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్(వీహెచ్‌ఏ), అలాగే వీఎస్ఏలను వర్క్ డిప్యుటేషన్‌పై శనివారం ఇతర గ్రామాలకు బదిలీ చేశారు. ట్రాన్స్‌ఫర్ల మీద బ్యాన్ ఉండటంతో వర్క్అడ్జస్ట్ కోసం తాత్కాలికంగా కలెక్టర్ ఆనంద్ వీరిని ఇతర ప్రాంతాలకు నియమించుకునేందుకు ఎంపీడీఓలకు ఆదేశాలు జారీ చేశారు.

గాన జయంతి నేడు

నెల్లూరు(బృందావనం) : బాప్టిస్టు చర్చి డొనీహాల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 'క్రీస్తు గాన జయంతి' ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని చర్చి కార్యదర్శి గుర్రం అరుణ్‌కుమార్ శనివారం తెలిపారు. క్రీస్తు జనన వృత్తాంతాన్ని మధుర గీతాలతో ఆలపిస్తారని తెలియజేశారు.

పథకాలపై ప్రచారం చేయాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ అందించే పథకాలపై ప్రచారం చేయాలని జేసీ, డీసీసీబీ ఇన్‌చార్జి చైర్‌పర్సన్ కె.కార్తీక్ అన్నారు. నగరంలోని గాంధీబొమ్మ సెంటర్ వద్ద ఉన్న జిల్లా సహకార బ్యాంక్‌లో శనివారం పాలకవర్గ సమావేశం నిర్వహించారు. రైతులకు పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలను నిబంధనల మేరకు మంజూరు చేయాలని సూచించారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

అయ్యప్పస్వామికి పూజలు

నెల్లూరు(బృందావనం) : వేదాయపాళెంలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో స్వామివారికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఉభయకర్తలుగా బట్టేపాటి విజయమ్మ, నరేందర్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, కలికి భక్తవత్సలరెడ్డి, లత, చెన్నారెడ్డి రమేష్‌రెడ్డి, జ్యోతిర్మయి, కొప్పోలు సుబ్బయ్య, పెంచలమ్మ వ్యవహరించారు.

ఘనంగా ధ్యాన దినోత్సవం



నెల్లూరు(బృందావనం) : పొదలకూరు రోడ్డులోని శ్రీరామచంద్ర మిషన్ ధ్యానమందిరంలో శనివారం ధ్యాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నగరంలోని నారాయణ, గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలతో పాటు వివిధ విద్యాసంస్థల్లో ధ్యాన దినోత్సవాన్ని జరిపినట్లు జోనల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎం.వెంకటకృష్ణ తెలిపారు.

నగర డీఎస్పీ తనిఖీ



నెల్లూరు(క్రైమ్) : స్థానిక నవాబుపేట పోలీస్‌స్టేషన్‌ను నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి శనివారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి పెండింగ్ కేసుల పరిష్కారానికి సూచనలు చేశారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్టెడ్‌ల వివరాలను ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషాను అడిగి తెలుసుకున్నారు.

వెంకటరాయశాస్త్రికి నివాళి



నెల్లూరు(బృందావనం) : పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో వెంకటరాయశాస్త్రి 171వ జయంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నిర్వాహకులు మజ్జిగ ప్రభాకర్‌రెడ్డి, టి.రవిచంద్రన్, చీమకుర్తి వెంకటేశ్వర్లు, పి.నాగేశ్వరరావు పాల్గొని శతావధాని కొండపి మురళీకృష్ణను సన్మానించారు.